ప్రజాశక్తి
శుక్రవారం 19 డిసెంబర్ 2025
5
అనంతపురం



డా॥రామసుబ్బయ్య కన్నుమూత


డా॥రామసుబ్బయ్య

'అనంత' వైద్యుడిగా గుర్తింపు తెచ్చుకున్న డాక్టర్ రామసుబ్బయ్య కన్నుమూశారు. వయోభారం అనారోగ్య సమస్యలతో గురువారం ఆయన అనంతపురం నగరం రామ్‌నగర్‌లోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. డాక్టర్ రామసుబ్బయ్యకు ఉమ్మడి అనంతపురం జిల్లా వైద్య రంగంలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. సుదీర్ఘకాలంగా వైద్య రంగంలో సామాజిక దక్పథానికి నిలువుటద్దంగా నిలిచారు. వైద్య సేవలతో పాటు ప్రజ సేవలను ప్రత్యేకతను చాటుకున్నారు. అనంతపురం జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడంలో ఆయన ప్రముఖ భూమిక పోషించారు.


వార్త 8లో

ఎమ్మెల్యేల సామ్రాజ్యం.. ఎంపీలపై పెత్తనం..!

◆ ఎంపిలు ఎక్కడికెళ్లినా ఎమ్మెల్యేల నుంచి వ్యతిరేకత
◆ కేంద్ర పథకాల్లోనూ భాగస్వామ్యం లేదనే అసంతృప్తి







ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

జిల్లాలో రాజకీయంగా చూసినప్పుడు అన్నింటిలోనూ ఎమ్మెల్యేలు కీలకంగా ఉంటున్నారు. వారి నియోజకవర్గాలను సామ్రాజ్యాలుగా భావిస్తున్నారన్న చర్చ రాజకీయవర్గాల్లో నడుస్తోంది. వారితోపాటు ఎన్నికల్లో నిలబడి ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన పార్లమెంట్ సభ్యులు (ఎంపి)లు కూడా ఎమ్మెల్యేల ఎదుట దిగదుడుపుగానే మారుతోంది పరిస్థితి. తాజాగా గుంతకల్లులో చోటు చేసుకున్న పరిణామం ఈ అంశాన్ని మరోమారు చర్చకు దారితీసింది. అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎన్నికయ్యారు. ఆయన పరిధిలోని గుంతకల్లు ప్రాంతాల్లో పనులు చేస్తున్నారని తెలిసినప్పటికీ ఆ నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు తమ వాటా తమకు డబ్బులివ్వాల్సిందేనని డిమాండ్ చేసినట్టు ఆరోపణలు గుప్పుమన్నాయి. తరువాత తనకేమీ సంబంధం లేదని ఎమ్మెల్యే చెప్పినప్పటికీ ఆయనపై ఆరోపణలు మాత్రం కొనసాగుతున్నాయి. ఈ విషయం పార్టీ అధిష్టానం వరకు వెళ్లినట్టు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని రైల్వే పైప్‌లైన్‌కు సంబంధించిన పనుల విషయంలో ఈ వివాదం బహిర్గతమైంది. ఇలా ఇతర ప్రాంతాల్లోనూ పార్లమెంట్ సభ్యులకు స్థానిక ఎమ్మెల్యేల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్న సందర్భాలూ అనేకమున్నాయని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అనంతపురం జిల్లాలోనే ఒక మార్కెట్‌యార్డును ఎంపి అంబికా లక్ష్మీనారాయణ సందర్శించారు. ఆ సమయంలోనూ స్థానిక ఎమ్మెల్యే నీవు ఏ రకంగా తన నియోజకవర్గం పరిధిలోని మార్కెట్‌యార్డును సందర్శిస్తావని గట్టిగా ప్రశ్నించినట్టు సమాచారం. ప్రజాప్రతినిధిగా అక్కడి పరిస్థితులను పరిశీలించేందుకు వెళ్లానని చెప్పినప్పటికీ ఇద్దరి మధ్య వివాదం మాత్రం చోటు చేసుకుంది. ఇంకొన్ని నియోజకవర్గాల్లోనూ ఎంపి పాల్గొనేందుకు వెళ్లిన సమయంలో స్థానిక నేతల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుండటం పార్టీ వర్గాల్లో చర్చనడుస్తోంది. ఎంపీ కూడా స్వయంగా ఒక దిశా సమావేశంలో అధికారుల తీరుపైనా అసంతృప్తిని బాహాటంగానే వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల కింద నిధులు మంజూరై ప్రారంభిస్తున్న సమయంలో ప్రోటోకాల్ పాటించడం లేదని అధికారుల దృష్టికి దిశా సమావేశంలో తీసుకెళ్లారు. ప్రధానంగా ఉపాధి హామీ పథకం నిధులతో పనులు చేపడుతున్న సమయంలో కనీస సమాచారం ఉండటం లేదని చెప్పారు. వీటిని తానే స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తూనే, ప్రోటోకాల్ విషయంలోనూ అశ్రద్ధ చేస్తే ఫిర్యాదు చేస్తానని హెచ్చరించడం గమనార్హం. ఏడు నియోజకవర్గాల ప్రజల చేత ఎన్నుకోబడిన ఎంపిలకు అభివృద్ధి పనుల్లో తగిన భాగస్వామ్యం కల్పించడం లేదన్న అసంతృప్తి వారిలో స్పష్టంగా కనిపిస్తోంది. ఎమ్మెల్యేలు మాత్రం అభివృద్ధి మొత్తాన్ని తమ ఖాతాల్లో వేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా చేపట్టే పనుల్లోనూ ఎంపిలకు తగిన ప్రాధాన్యత కల్పించడం లేదన్న విమర్శలూ ఉన్నాయి. ఈ అంశాలు పలుమార్లు వివాదాలు చోటు చేసుకుని అధిష్టానం వరకు వెళ్లినా పెద్దగా సర్దుబాటు చర్యలేవి లేనట్టుగానే కనిపిస్తున్నాయి. తాజగా గుంతకల్లు వ్యవహారంతో ఎంపి ప్రాధాన్యత అంశం మరోమారు తెరపైకి వచ్చినట్టయింది.

గ్రామస్థాయిలో రెవెన్యూ డిజిటల్ లైబ్రరీ

ముఖ్యమంత్రితో కలెక్టర్ ఓ.ఆనంద్


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో భాగంగా అనంత జిల్లాలో గ్రామస్థాయిలో రెవెన్యూ రికార్డుల లైబ్రరీ సిద్ధంగా ఉందని కలెక్టర్ ఓ.ఆనంద్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తెలియజేశారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన 5వ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రెండవ రోజు గురువారం నాడు అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎస్పీ పి.జగదీష్ పాల్గొన్నారు. జిల్లా అభివృద్ధి, శాంతిభద్రతలకు తీసుకుంటున్న చర్యలపై ముఖ్యమంత్రికి తెలియజేశారు. రెవెన్యూ రికార్డుల డిజిటైజేషన్లో ఎఐ వినియోగంపై కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరించారు. అనంతపురంలో రెవెన్యూ రికార్డులు సరిగ్గా లేకపోవటం, 22 ఏ లాంటి తీవ్రమైన అంశంగా ఉండేదని వీటన్నింటినీ డిజిటలైజేషన్ సర్వేనెంబర్ లైబ్రరీ తయారు చేశామని తెలియజేశారు. రెవెన్యూ ఆఫీస్ టూల్ తయారు చేసి యూజర్లకు అనువుగా మార్చామని వివరించారు. అనంత జిల్లాలో గ్రామస్థాయిలో రెవెన్యూ రికార్డుల లైబ్రరీ సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సమావేశంలోనే జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న ముందస్తు చర్యలు గురించి ఎస్పీ జగదీష్ ముఖ్యమంత్రికి తెలియజేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, గంజాయి నిర్మూలన, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు.

నీళ్లు.. నిధులివ్వండి

ఇరిగేషన్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కరవు ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాకు నిధులు, నీళ్ల ఇవ్వాలని ఇరిగేషన్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్ కోరారు. గురువారం నాడు విజయవాడ జల సౌద ఇంజినీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలా కృష్ణ అధ్యక్షతన మూడవ బోర్డు సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న పత్తి చంద్రశేఖర్ ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించిన పలు విషయాలను సమావేశం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించమని కోరారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో ఎంతో సారవంతమైన నేల ఉన్న నేపథ్యంలో ఈ ప్రాంతాలకు సకాలంలో నీరు అందించగలిగితే రైతులు అత్యద్భుత దిగుబడి సాధిస్తారన్నారు. ఇరిగేషన్‌కు సంబంధించిన కార్యాలయాల్లో సిబ్బంది కొరతను కూడా భర్తీ చేయాల్సుందని ఆయన సమావేశం దృష్టికి తీసుకెళ్లారు.


సమావేశంలో పాల్గొన్న పత్తి చంద్రశేఖర్

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు - ఆర్డీవో

ప్రజాశక్తి-కుందుర్పి

ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో వసంతకుమార్ హెచ్చ రించారు. ఆయన గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలన్నీ తనిఖీ సందర్శించారు. ఆయన మాట్లాడు తూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారుల నిమ్మకు నీరెత్తిన విధంగా వ్యవహరించడంపై మండిపడ్డారు. మండల వ్యాప్తంగా 16 గ్రీవెన్స్ అర్జీలు పెండింగ్ ఉండడంతో వాటిని పరిష్కరించేం దుకు కృషి చేస్తున్నానని తెలిపారు. ఇకనైనా నిర్లక్ష్యం వీడి గ్రీవెన్స్ అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించా లని ఆదేశించారు. అంతకుముందు ఆయన పల్స్‌పోలియో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ డి.ఓబులేష్, డిప్యూటీ తహశీల్దార్ తిప్పేస్వామి, వైద్యాధికారులు తరుణ్‌సాయి, సోమేశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యునిగా బంగి శివ


బంగి శివ

ప్రజాశక్తి-రాయదుర్గం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యునిగా రాయదుర్గం ప్రాంతానికి చెందిన బంగి శివ ఎన్నికయ్యారు. ఇటీవల తిరుపతిలో జరిగిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అందులో బంగి శివను సభ్యునిగా ఎన్నుకున్నారు. శివ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యా విధానం కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలను ప్రోత్సహించేలా, ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసేలా ఉందన్నారు. బడ్జెట్‌లో విద్యాశాఖకు కోత విధించడం, ఫీజులు పెంచడం, సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయకపోవడం వల్ల లక్షలాది మంది విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారన్నారు. జిల్లాలో ప్రభుత్వ ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉందన్నారు. ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ రాజీలేని పోరాలాటు చేస్తుందన్నారు.

పల్స్‌పోలియోపై ర్యాలీ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఈ నెల 21వ తేదీ పల్స్‌పోలియో సందర్భంగా గురువారం వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు స్థానిక పిహెచ్‌సి నుంచి ప్రారంభించి పురవీధుల గుండా ర్యాలీ కొనసాగించారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని 33 గ్రామాల్లో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులు సుమారు 9వేల మంది ఉన్నారని, వారందరికీ పోలియో చుక్కలు వేయాలని సూచించారు. ఆయా గ్రామాల్లో సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు. ర్యాలీలో శ్రీధరఘట్ట, దర్గాహొన్నూరు, స్థానిక పిహెచ్‌సి వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి-రాయదుర్గం

ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ. 8,89,315 విలువైన చెక్కులను గురు వారం రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో 30 మంది లబ్ధిదారులకు అందజేశారు. కాలవ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు సిఎం సహాయనిధి కొండంత భరోసా అన్నారు. ఈ ఏడాది నియోజకవర్గ వ్యాప్తంగా 210 మందికి రూ. 1,67,67,944 లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

పంటల సాగులో రైతులు మెలకువలు పాటించాలి కెవికె కోఆర్డినేటర్ చెంద్రాయుడు సూచించారు. స్థానిక కెవికెలో గురువారం ఎడిఎ యల్లప్ప, ఏవోలు శ్రావణ్, పృథ్వీ, విజయ్, గోపాల్, మహేష్, వాసుకిరాణి, సైంటిస్టులతో కలిసి ఆర్‌ఎస్‌కె సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఖరీఫ్‌లో కంది, వేరుశెనగ, ఆముదం, మొక్కజొన్న, టమోటా, అరటి పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, పంటను అమ్ముకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించి చెప్పాలన్నారు. శాస్త్రవేత్తలు మల్లికార్జున, యుగంధర్ వేరుశెనగ, హార్టికల్చర్ పంటల్లో యాజమన్య పద్ధతులను వివరించారు. సాంకేతిక విధానాలను సిఫార్సు చేసి మందుల పిచికారిలో కూడా అవగాహన కల్పించాలన్నారు.



మాట్లాడుతున్న కెవికె కోఆర్డినేటర్ చెంద్రాయుడు

అసంపూర్తిగా రైల్వే ఓవర్ బ్రిడ్జి..!

◆ పదేళ్లలో అంచనా వ్యయం 4 రెట్లు పెంపు ◆ వాహనదారులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి-రాయదుర్గం



అనంతపురం రోడ్డులో లెవెల్ క్రాసింగ్ వద్ద వేచి ఉన్న వాహనాలు

పట్టణంలో రైల్వే లైన్ల వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టి పదేళ్లయినా నేటికీ పూర్తి కాకపోవడంతో ఈ మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు రైల్వే గేట్ పడితే వేచి ఉండాల్సి వస్తోంది. రాయదుర్గం నుంచి అనంతపురం, కణేకల్లు వెళ్లే మార్గాల్లో రోడ్డుకు అడ్డంగా రైలు మార్గం వెళ్తుంది. రెండు చోట్ల రోడ్డు క్రాసింగ్ గేట్లు ఉన్నాయి. సగటున రోజుకు ప్యాసింజర్, గూడ్స్ రైళ్లు కనీసం 30 ఈ మార్గంలో ప్రయాణిస్తాయి. రైలు వచ్చిన ప్రతిసారీ 5 నుంచి 10 నిమిషాలు గేటును మూసివేయడం వల్ల ప్రయా ణికులు గేటు వద్ద వేచి ఉండక తప్పడం లేదు. పదేళ్ల క్రితం అనంతపురం, కణేకల్లు రోడ్డులో ఉన్న రైల్వే గేట్ల స్థానంలో ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి అధికారులు ఒక్కో బ్రిడ్జికి రూ. 10 కోట్లతో అంచనాలు తయారు చేశారు. రైలు మార్గంపై రైల్వే శాఖ పరిధిలో ఉన్న స్థలంలో రైల్వే శాఖ వంతెన నిర్మాణ పనులు చేపట్టింది. అయితే ఈ వంతెనకు ఇరువైపులా రోడ్డు ర్యాంపును రోడ్లు భవనాల శాఖ నిర్మించా ల్సి ఉంది. ఇందుకు అవసరమైన నిధులు విడుదల చేయకపోవడం వల్ల ఫ్లైఓవర్ నిర్మాణం అసం పూర్తిగా మిగిలిపోయింది. పదేళ్ల వ్యవధిలో అంచనా వ్యయం అనంతపురం రోడ్డు ఫ్లై ఓవర్‌కు రూ. 40 కోట్లు, కణేకల్లు రోడ్డు ఫ్లైఓవర్‌కు రూ. 35 కోట్లకు పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం వద్ద అవసరమైన నిధులు లేకపోవడం వల్ల రైల్వే శాఖనే ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవను కోరారు. గతంలో బాక్సు తరహాలో ప్రతి పాదించిన ఫ్లైఓవర్ రోడ్డు స్థానంలో పిల్లర్లతో కూడిన ఫ్లై ఓవర్ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు రైల్వే మంత్రితో పాటు రైల్వే బోర్డు అధికారులను కోరారు. వీటికి తోడు ఆదనంగా బిటి ప్రాజెక్టు రోడ్డు, గొళ్లపల్లి రోడ్డు వద్ద కూడా బ్రిడ్జిలు నిర్మించాలని కోరారు. వాహన చోదకులు, ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పాలకులు, అధికారులు వెంటనే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న ఛైర్‌పర్సన్ గౌతమి, అధికారులు

వార్డుల్లో సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఛైర్‌పర్సన్ తలారి గౌతమి సోమశేఖర్ అధికారులకు సూచించారు. ఆమె గురువారం కౌన్సిలర్ వెంకటేశులు, కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, ఇంజినీర్ ఉపేంద్రతో కలిసి 3వ వార్డులో పర్యటించారు. ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, తాగునీటి సమస్యలు ఉన్నట్లు గుర్తించి వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట నాయకులు సత్తి, వెంకటరెడ్డి, గోపాల్, ఈశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-శెట్టూరు

స్థానిక ఎపి మోడల్ స్కూల్‌లో గురువారం కెరీర్ యాక్టివిటీ ఎక్స్‌పో అండ్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఒకేషనల్ అధ్యాపకుడు వినోద్ కుమార్ మాట్లాడుతూ ఒకేషనల్ శిక్షణలో భాగంగా విద్యార్థులు కెరీర్‌లో తీసుకోవాల్సిన కోర్సులు, వాటి ఉపయోగాలు, ఉద్యోగావకాశాల గురించి తెలుసుకోవాలన్నారు. ఈ ఎక్స్‌పో ద్వారా విద్యార్థులకు పలు విషయాల పై ప్రాక్టికల్ నాలెడ్జ్ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు మహేష్, పిడి జబి సలీమ్, కౌన్సిలర్ ప్రహ్లాద పాల్గొన్నారు.


నమూనాలను తయారు చేసిన విద్యార్థులు

అధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం

కార్యక్రమం బహిష్కరణ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ఎంపిడిఒ కార్యాలయ అధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కార్యక్రమాన్నే బహిష్కరించారు. పలు గ్రామ పంచాయతీలకు పనిముట్లు, ట్రాలీల పంపిణీకి గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద డిఎల్‌డిఒ నాగేశ్వరరావు, ఎంపిడిఒలు ధనుంజయ, మాధవి, ఉమాదేవి, డిప్యూటీ ఎంపిడిఒలు, పంచాయతీ కార్యదర్శులు ఏర్పాట్లు చేశారు. అయితే కొన్ని గ్రామ పంచాయతీలకే పనిముట్లు తెప్పించినట్లు తెలియడంతో ఎమ్మెల్యే అసంతృప్తికి లోనయ్యారు. అన్ని గ్రామపంచాయతీలకు పరికరాలు వచ్చాకే పంపిణీ చేస్తానంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

మండలంలోని పాపంపల్లి గ్రామానికి చెందిన 11 వైసిపి 11 కుటుంబాలు టిడిపిలో చేరగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పసుపు కండువాలు కప్పి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంతో పాటు నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసి టిడిపిలోకి చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, రామాంజినేయులు, మండల కన్వీనర్ వెంకటేశులు, సింగిల్‌విండో అధ్యక్షుడు నారాయణ, కొల్లాపురప్ప, తదితరులు పాల్గొన్నారు.



టిడిపిలోకి చేరిన వారితో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

అంగన్వాడీల బలోపేతమే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మె ల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. పట్టణంలోని ప్రజావేదికలో గురువారం ఎమ్మెల్యే అంగన్వాడీ కార్యకర్తలకు 5జి సెల్‌ఫోన్లు, ప్రీ స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లలు, గర్భి ణులు, బాలింతలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అంగన్వాడీ కేంద్రాలు పని చేయాల న్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. చిన్నారులను సొంత పిల్లల్లా చూసుకోవాలన్నారు. అంగన్వాడీల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సిడిపిఒలు లక్ష్మీప్రసన్న, పద్మావతి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ తలారి గౌతమి, మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ లక్ష్మిదేవి, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల, ప్రాజెక్టు అధ్యక్షురాలు పాతక్క, కోశాధికారి రాధాలక్ష్మి, విజయనిర్మల, సత్యవతి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



ప్రీస్కూల్ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

పల్స్‌పోలియోను విజయవంతం చేద్దాం

పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం ఈ నెల 21వ తేదీ చేపట్టే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని సమిష్టిగా విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజావేదిక వద్ద ఎమ్మెల్యే డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ రాజేష్, సిడిపిలు ప్రసన్నలక్ష్మి, పద్మావతి, వైద్యశాఖ బృందం, మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ లక్ష్మిదేవి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ తలారి గౌతమి సోమశేఖర్‌లతో పల్స్‌పోలియో పోస్టర్‌ను విడుదల చేశారు. వైద్య ఆరోగ్య శాఖ, అంగన్వాడీ సిబ్బంది సమిష్టిగా పని చేస్తేనే లక్ష్యసాధన సాధ్యమవుతుందన్నారు.

పైపులైన్ లీకేజీ.. తాగునీరు వృథా..!


వృథాగా వెళ్తున్న నీరు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని కోట ముఖ ద్వారం సమీపంలో రోడ్డు దిగువన ఉన్న పైపులైన్‌కు లీకేజీ ఏర్ప డింది. దీంతో తాగునీరు వదిలిన ప్రతిసారీ ఈ ప్రాంతంలో నీరు లీకై రోడ్డుపైకి ఉబికి సమీపంలోని తేరు వీధి వరకూ రోడ్డుపై నీరు నిలుస్తాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉండటంతో రోడ్డు దిగువన గల పైపులైన్ మరమ్మతులు చేయడం కష్ట తరం అవుతోంది. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి దష్టికి తీసుకుపోగా పైపులైన్ లీకేజీ ఎక్కడ ఉందో గుర్తించడం కష్టంగా ఉంది. రోడ్లు భవనాల శాఖ అధికారులతో సంప్రదించి వీలైనంత త్వరగా పైప్ లైన్ మరమ్మతులు చేపడతామని తెలిపారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల వ్యాప్తంగా సచివాలయాల్లో పని చేస్తున్న డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వైద్య సిబ్బందికి గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో యూనిఫైడ్ సర్వేపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ విజయభాస్కర్ మాట్లాడుతూ యూనిఫైడ్ సర్వేలో భాగంగా మీరు ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ వెంకటరమణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

విశాఖలో ఈనెల 31వతేదీ నుంచి నిర్వహించనున్న మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు పిలుపునిచ్చారు. గురువారం అనంతపురం రూరల్ మండలం కందుకూరు పంచాయతీలో ఉన్న జంగాలపల్లి ఫుడ్ కార్పొరేషన్ గోడౌన్‌లో హమాలీ కార్మికులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. తర్వాత మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంగాలపల్లి ఫుడ్ కార్పొరేషన్‌ను ప్రయివేటుపరం కాకుండా కాపాడుకుందామని పిలుపునిచ్చారు. గతంలో ఈ గోడౌన్‌లో దాదాపు 500 మంది హమాలీలు పని చేస్తుండేవారని, బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోడౌన్ మూతవేసే విధంగా చర్యలు చేపట్టిందన్నారు. ఇక్కడ పని చేస్తున్న హమాలీలు ఇతర ప్రాంతాల్లో పని చేస్తున్నారు వీటిపై మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. 11 ఏళ్ల నుంచి కేంద్రంలోని బిజెపి మోడీ, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్నాయన్నారు. బిజెపి మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజల్లో చీలిక తెచ్చి పాలన చేస్తూ రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తోందన్నారు. వాటికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మన్నీల రామాంజనేయులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సిఐటియు మండల నాయకులు పుష్పరాజు, నారపరెడ్డి, చిన్నరాయుడు, సన్నప్పయ్య, హుస్సేన్‌పీర, సుబ్బరాయుడు, గోపాల్, ఆదినారాయణ, మధు, పోతులయ్య, తదితరులు పాల్గొన్నారు.

22న డప్పు కళాకారుల సంఘం మహాసభలు

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప



కరపత్రాలు విడుదల చేస్తున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, డప్పు కళాకారులు

ప్రజాశక్తి-తాడిపత్రి

ఈనెల 22న జరిగే డప్పు కళాకారుల సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప పిలుపునిచ్చారు. ఈమేరకు మండల కేంద్రంలోని డప్పు కళాకారుల సంఘం కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి డప్పు శబ్దం ఆట, పాటలతో సమాజాన్ని కదిలించిందన్నారు. జిల్లాలో వేలాది మంది డప్పు కళను నమ్ముకుని జీవిస్తున్నారన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలన్నా, పండుగలు, జాతర్లు, పెళ్లిళ్లు రాజకీయ నాయకుల సభలు, ఊరేగింపులు జరగాలంటే డప్పు తప్పనిసరి అన్నారు. ఆట, పాట, డోలు, హార్మోనియం, వీణ, వయోలిన్ లేని కాలంలో డప్పు పుట్టిందన్నారు. డప్పు తర్వాత పుట్టిన కళలకు గుర్తింపు ఇచ్చిన పాలకులు.. వివక్షతతో డప్పు కళకు గుర్తింపు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు, డప్పు, డ్రస్, గజ్జెలు లేవన్నారు. గ్రామాల్లో డప్పు కళాకారులకు ఎలాంటి రక్షణ, పింఛన్ సౌకర్యం లేదన్నారు. కావున ప్రభుత్వం స్పందించి అర్హులైన కళాకారులందరికీ గుర్తింపు కార్డులు, పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు డప్పు, డ్రస్సు, గజ్జెలు, ఇంటి స్థలం, ఇల్లు, రెండెకరాల భూమి ఇవ్వాలన్నారు. ఆయా సమస్యలపై చర్చించుకుని జిల్లావ్యాప్తంగా డప్పు కళాకారుల సమస్యల సాధన కోసం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో అనంతపురం 3వ జిల్లా డప్పు కళాకారుల సంఘం మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభల్లో డప్పు కళాకారులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.నాగరాజు, శ్రీరాములు, పెద్దన్న, కుళ్లాయప్ప, తిరుపాలు, ఓబులేసు, రంగన్న, పక్కీరప్ప, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు భరోసానిస్తే ఏదైనా సాధిస్తారు..

మహిళా శిశు సంక్షేమ శాఖ కో ఆర్డినేటర్ డాక్టర్ బిఎన్.శ్రీదేవి



మాట్లాడుతున్న బిఎన్ శ్రీదేవి

ప్రజాశక్తి-వజ్రకరూరు

ప్రస్తుత పోటీ ప్రపంచంలో బాలికలకు భరోసా ఇస్తే దేన్నైనా సాధించగలరని మహిళా శిశు సంక్షేమ శాఖ మిషన్ కోఆర్డినేటర్ బిఎన్ శ్రీదేవి సూచించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉరవకొండ మండల పరిధిలోని రేణుమాకులపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికల చట్టాలు, అవకాశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో చదువుతున్న వేలాది బాలికలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించడం శిక్షణ ప్రధాన లక్ష్యమన్నారు. బాలికలకు భరోసా ఇవ్వగలిగితే ఎంతటి క్లిష్టమైన లక్ష్యాన్ని అయినా సునాయసంగా చేరుకుంటారన్నారు. ఇందులో భాగంగా బాలికలకు పాటల పోటీలు, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి, సర్టిఫికెట్లు, బహుమతులను అందజేస్తున్నామన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో వేధింపులు ఎదురైతే 112, 100, 1098 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాకే.భాస్కర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అరుణ, అంగన్వాడీ కార్యకర్త నాగలక్ష్మి, చాముండేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని రద్దు చేసే కుట్ర

జీవో ప్రతులను దగ్ధం చేసి నిరసన



పెద్దవడుగూరులో జీవో ప్రతులను దహనం చేస్తున్న ఉపాధి కూలీలు, నాయకులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

గ్రామీణ పేదలకు ఉపాధి హామీ చట్టాన్ని దూరం చేసే కుట్రకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతోందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు ఆదినారాయణ, మండల కార్యదర్శి రంగస్వామి, జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ ఆరోపించారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన బిల్లుల ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసే విధానం కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవి, మునెమ్మ, రంగమ్మ, శిరీషా, భాగ్యలక్ష్మి, నరసమ్మ, మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు : రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఉరవకొండలోని ఎంపిడిఒ కార్యాలయం ముందు ఉన్న గాంధీ విగ్రహం ఎదుట ఉపాధి హామీ చట్టం పేరు మార్పునకు సంబంధించిన జీవో ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి మాట్లాడుతూ మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పేరు మార్చి కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40శాతం నిధులు మోపడం అన్యాయమన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి తల లేని మొండెంలా తయారు చేస్తోందన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, వెంకటేశులు, రైతుసంఘం మండల కార్యదర్శి సిద్ధప్ప, తదితరులు పాల్గొన్నారు.

'యుఎఫ్ఎస్' నిర్వహణపై వినతి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఎంప్లాయీస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు మలిగెల వీరనారప్ప ఆధ్వర్యంలో గురువారం యునిఫైడ్ ఫ్యామిలీ సర్వే నిర్వహణ, వాటిలో ఏర్పడే సమస్యలపై మున్సిపల్ డిప్యూటీ కమిషనర్లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే (యుఎఫ్ఎస్)పై ఇప్పటి వరకూ ప్రజలకు సరైన ప్రచారం, అవగాహన కల్పించలేదన్నారు. విస్తృత ప్రచారం లేకపోతే సచివాలయ సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఒటిపి, ఆధార్ ధృవీకరణ విషయంలో ప్రజలు భయాందోళనలో ఉన్నారని ఈ సమయంలో ఒక కుటుంబ సర్వేకు ఎక్కువ సమయం, అనేక ఒటిపిలు అవసరమవుతున్నాయన్నారు. దీంతో రోజుకు తక్కువ కుటుంబాలే పూర్తవుతున్నాయన్నారు. మొబైల్ ఫోన్లు, సిమ్‌కార్డులు, బయోమెట్రిక్ పరికరాలు, సర్వర్లు ప్రభుత్వమే అందించాలన్నారు. యాప్‌లు సరిగా పని చేయడంతోపాటు సర్వర్ సామర్థ్యం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వీరనారప్ప, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీకాంత్, చిన్నారప్ప, సుధాకర్, రామకృష్ణ, కిషోర్‌కుమార్, చీరాల చంద్ర, కదిరప్ప, కృష్ణమూర్తి, నాగరాజు, ఈశ్వరయ్య, సాయినాథ్, ప్రదీప్, శంకరరెడ్డి, రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టెట్‌పై రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలి

యుటిఎఫ్ నాయకుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

టెట్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అలెగ్జాండర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2010కి ముందు నియామకం పొందిన ప్రతి ఉపాధ్యాయుడు టెట్ కచ్చితంగా పాస్ కావాల్సిందేనని గౌరవ సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ ఉపాధ్యాయుల పక్షాన వేయాలన్నారు. స్వయానా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రివ్యూ పిటిషన్ దాఖలు చేస్తామని చెప్పినా ఆచరణలో అమలు కాలేదని ఆవేదనకు గురవుతున్నారన్నారు. ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ మంత్రి కేంద్ర విద్యాశాఖ మంత్రి గారిని కలిసిన సందర్భంలోనైనా ఈ అంశాలు ప్రస్తావించకపోవడం ఉపాధ్యాయులను అవమానపరిచినట్లుగా భావించాల్సి వస్తుందన్నారు. 2025 జూన్‌లో బదిలీ కోరుకున్న వందలాది మంది ఉపాధ్యాయులు నేటికీ రిలీవింగ్‌కు నోచుకోలేదన్నారు. తాజాగా విద్యాశాఖ 1146 మంది అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని భావించిన ఈ సమయంలోనైనా రిలీవ్ కావాల్సిన ఉపాధ్యాయుల గురించి విద్యాశాఖ ఆలోచించకపోవడం చాలా బాధాకరమన్నారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య మాట్లాడుతూ సింగిల్ టీచర్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు సెలవులు వినియోగించుకునేలా చూడాలని, 10 తరగతి వందరోజుల ప్రణాళికలో ఉన్న సాధారణ సెలవులు పండుగ దినాలను మినహాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, జిల్లా కార్యదర్శులు సుబ్బరాయుడు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, సీనియర్ నాయకులు నాగేంద్ర, హెంద్రీ, చంద్రశేఖర్, రామాంజనేయులు, మంజునాథ్, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'మోడరన్ అనంతపురం' వైపు అడుగులు

అహుడా ఛైర్మన్ టిసి వరుణ్



మాట్లాడుతున్న టిసి వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనాధికార లే అవుట్లపై కఠిన చర్యలు తీసుకుని మోడరన్ అనంతపురం వైపు అడుగులు వేస్తున్నామని అహుడా ఛైర్మన్ టిసి వరుణ్ అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో వైస్ ఛైర్మన్ శివ్‌నారాయణ్‌శర్మతో కలిసి అహుడా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా అనంతపురంలో స్విమ్మింగ్ పూల్, జిమ్, ఫుడ్ కోర్ట్ ఏర్పాటు ప్రణాళికపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో పెనుగొండ, మడకశిర ఎంఐజి లేఅవుట్‌లలో ప్లాట్లకు ఈ యాక్షన్, వైసిపి హయాంలో వదిలేసిన హిందూపురం, కోడూరు ఎంఐజి లేఅవుట్ పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. అనుమతులు తీసుకుని మూడేళ్లలో పనులు పూర్తి చేయని, యజమానులు డెవలప్పర్లకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరించారు. తర్వాత ధర్మవరం కొనుతూరు లేఅవుట్ ప్లాట్ల విక్రయానికి కియోస్ ఏర్పాటు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ రామకృష్ణారెడ్డి, సిబ్బంది ఇషాక్, తదితరులు పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న ఎస్‌కెయు విసి బి.అనిత

ఎస్‌కెయులో పలు విభాగాల తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ బి.అనిత గురువారం వర్సిటీలోని పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, ఇంగ్లీష్, తెలుగు విభాగాలను తనిఖీ చేసి ఉద్యోగుల హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ తరగతులకు కచ్చితంగా హాజరు కావాలన్నారు. అయితే తరగతి గదులు శుభ్రంగా లేకపోవడం గమనించి స్వీపర్‌ను పిలిపించి విభాగాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయా విభాగాల అధిపతులతో సమావేశం నిర్వహించి తరగతుల నిర్వహణ అంశంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ కో-ఆర్డినేటర్ డి.చంద్రమౌళిరెడ్డి, ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపాలి : ఆర్‌డిఒ



మాట్లాడుతున్న ఆర్‌డిఒ కేశవనాయుడు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని ఆర్‌డిఒ కేశవనాయుడు సంబంధిత విఆర్‌ఒలను ఆదేశాలు జారీ చేశారు. గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి శేషారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని.. అలాకాకుండా మీ వద్దనే పెండింగ్ పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే రీసర్వే పకడ్బందీగా చేపట్టాలన్నారు. స్పందనలో వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడంతోపాటు వారితో ఫొటో దిగి స్పందనను చేయించాల్సి బాధ్యత మీపై ఉందన్నారు.

29లోపు 'సమీత్వ'ను పూర్తి చేయండి

ఈనెల 29వతేదీలోపు రెండవ విడత సమీత్వ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆర్‌డిఒ కేశవనాయుడు సచివాలయ సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అలివేలమ్మ, తహశీల్దార్ శేషారెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

క్విజ్, వక్తృత్వ పోటీల విజేతలకు అభినందనలు

ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి-అనంతపురం

ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఎపిఎస్‌పిడిసిఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్‌పోటీల్లో కడప జిల్లా విద్యార్థులు, వక్తృత్వ పోటీల్లో తిరుపతి సర్కిల్ విద్యార్థి విజేతలుగా నిలిచినట్లు సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆయా జిల్లా కార్యాలయాల ద్వారా ఎపిఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి బుధవారం సాయంత్రం ఫైనల్ రౌండ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీల్లో కడప జిల్లా నుంచి జీవీవీ నాగిరెడ్డి, ఇ. నాగ రిషిత, వై.ప్రణీత్ రెడ్డి, వి.వైష్ణవి బృందం విజేతగా నిలిచింది. వక్తృత్వ పోటీల్లో తిరుపతి సర్కిల్ గూడూరులోని సిఎస్ ఎం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జె.అద్రిజా రావు మొదటి స్థానంలో నిలువగా, చిత్తూరు జిల్లా పైపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కే. మనీషా ద్వితీయ స్థానం, అనంతపురం జిల్లాలోని లక్ష్మీ సినర్జీ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న టి.యశస్విని తృతీయ స్థానంలో నిలిచారు. ఆయా పోటీల విజేతలను సిఎండి అభినందించారు.

జెఎన్‌టియు సూపరింటెండెంట్‌గా నాగభూషణం

అనంతపురం : జెఎన్‌టియు సూపరింటెండెంట్‌గా ఎండి నాగభూషణంను తిరిగి నియమించారు. నాగభూషణంను గత ప్రభుత్వంలో ఉద్యోగం తొలగించిన విషయం తెలిసిందే. అయితే కూటమిప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒటిపిఆర్ఐ సూపరింటెండెంట్‌గా నియమిస్తూ గురువారం ఉత్తర్వలు జారీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న నాగభూషణం వెంటనే విధుల్లోకి చేరారు.

విద్యార్థుల సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-శింగనమల

బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటి (అటానమస్) కళాశాల విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవలో రాణిస్తున్నారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని నాయనవారిపల్లి గ్రామంలో ఎస్ఆర్ఐటి ఎన్ఎస్ఎస్ యూనిట్-4 ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి నిరుద్యోగం, అక్షరాస్యత, స్వచ్ఛభారత్, యోగా, ధ్యానం, డిజిటల్ లావాదేవీలు, స్వయం ఉపాధి పథకాలు, వర్షం నీటి సేకరణ, ప్లాస్టిక్ వాడకం నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు కె.రమణమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలనల్లప్ప, గ్రామపెద్ద గుత్తా ఆదినారాయణ, రంగస్వామి ఆచారి, రాజగోపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సి.లక్ష్మీనారాయణ, వై.మధుసూదన్, టి.అరవిందబాబు, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లపై నిర్లక్ష్య వైఖరి వీడాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం కలెక్టరేట్ : ప్రభుత్వ పెన్షనర్లపై ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్రాంత ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లె చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలోని వేణుగోపాల్ నగర్‌లో ఉన్న తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, అధ్యాపకులు ఎంతోమందికి డీఆర్ అరియర్స్, పిఆర్‌సి, ఐఆర్, ఇతర అలవెన్సులు ఇవ్వకపోవడంతో ఎంతోమంది పెన్షనర్ల జీవితాలు చాలా దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించి పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

జనవరిలో కంది కొనుగోలు కేంద్రం ఏర్పాటు

శింగనమల : జనవరి రెండవ వారంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కంది కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి అన్వేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కందిపంటను క్వింటా రూ.8వేలతో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఈక్రాప్ చేసుకున్న రైతులందరూ తప్పనిసరిగా మీ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

టిప్పర్, హిటాచీ సీజ్

యల్లనూరు : అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌తోపాటు ఇటాచీ వాహనాలను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. మండల కేంద్రం సమీపంలోని ప్రయివేటు ఇసుక రీచ్‌లో కాకుండా వేరే ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండటంతో సమాచారం తెలుసుకున్న మైనింగ్ జియాలజిస్టు కె.వరప్రసాద్‌రెడ్డి, ఆర్‌డిఒ కేశవనాయుడు, తహశీల్దార్ రాము ఆదేశాలతో లోడు చేస్తున్న ఇటాచీ, టిప్పర్ వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

పేకాటజూదరులు అరెస్టు

ఆత్మకూరు : మండల పరిధిలోని తోపుదుర్తి గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. తోపుదుర్తి గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకోవడంతోపాటు రూ.23వేలు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-పామిడి

రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలలో ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ సదుబాబు ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డిఎల్ఎస్ఎ సెక్రటరీ రాజశేఖర్, గుత్తి సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ ఆచారి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఇందులో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమన్నారు. బాలల హక్కుల పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందన్నారు. బాలలపై లైంగిక వేధింపులు జరగకుండా నిర్మూలించడానికి 1098కి ఉచితంగా ఫోన్ చేసి సమాచారాన్ని తెలపవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషసాఫీసర్ సౌభాగ్య లక్ష్మి, ప్యానల్ అడ్వకేట్ గంగాధర్‌కుమార్, కె.శ్రీనివాసులు, కోర్టు సిబ్బంది సాదిక్, పారా లీగల్ వాలంటీర్ ఇస్మాయిల్, కెజిబివి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ

గుంతకల్లు : మున్సిపాలిటీలో పని చేస్తున్న 239 మంది పారిశుధ్య కార్మికులకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో దాత సత్రశాల జగదీష్ గుప్తా ఆర్థిక సహకారంతో రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టిడిపి టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతలో కీలకపాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికులు వర్షాకాలంలో తడవకుండా ఉండేందుకు రెయిన్ కోట్లను దాత సత్రశాల జగదీష్ గుప్తా అందజేయడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ నంగినేని భవాని, అసిస్టెంట్ కమిషనర్ మల్లెల లక్ష్మీదేవి, మెప్మా ప్రాజెక్టు అధికారి మోహన్, రోటరీ క్లబ్ అధ్యక్షులు సుదీర్ కార్వా, గవర్నర్ వక్కల ఉమా, తదితరులు పాల్గొన్నారు.

వార్డులో మున్సిపల్ అధికారుల పర్యటన

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని 20వవార్డులో మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియాతో పాటు వివిధ విభాగాల అధికారులు గురువారం పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా అంబేద్కర్ నగర్ నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా శివసాగర్ హోటల్ నుంచి వెళ్లే మురుగు కాలువ సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇఇ హేమచంద్ర కుమార్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ పి.మహబూబ్‌బాషా, టిపిఒ మారుతీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్

గుత్తి : పట్టణంలోని జెడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న సజనాత్మక తాను వెలికి తీయడానికి సైన్స్ ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. ప్రదర్శన ద్వారా విద్యార్థులు శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్ప్‌డెస్క్ ఏర్పాటు



విఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న వృద్ధుడు

బెళుగుప్ప : ప్రజా సమస్యలను విన్నవించేందుకు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో గురువారం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ బి.అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం సోమవారం మాత్రమే కాకుండా వారంలో ఎప్పుడైనా.. ఏ సమస్యనైనా ప్రజలు విన్నవించుకోవచ్చన్నారు.

అండర్‌పాస్ ఏర్పాటుకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

శింగనమల : మండల కేంద్రం సమీపంలోని మరువకొమ్మ వద్ద జాతీయ రహదారి 544-డిపై అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కలిసి కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ జయరాం గడ్కరీకి వినతిపత్రం అందజేశారు. శింగనమల క్రాస్ వద్ద అండర్ పాస్ లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. కావున అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఇందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

చెత్త తరలింపు వాహనాలు పంపిణీ

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు ట్రై సైకిళ్లతోపాటు తడి, పొడిచెత్త వేరు చేసే డస్ట్ బిన్లను పంపిణీ గురువారం పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత, ఎంపిడిఒ సాల్మన్, డిప్యూటీ ఎంపిడిఒలు సదాశివం, సుకన్య, పిఆర్ ఇంజినీర్ మద్దిలేటి, పంచాయతీ సెక్రటరీలు రామాంజనేయులు, మురళి, రేఖ, శారద, చిన్నరాయుడు, టిడిపి నాయకులు బుల్లే నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన

అనంతపురం కార్పొరేషన్ : నగరంలో ఈనెల 21వ తేదీన నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమంపై గురువారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్లో డిప్యూటీ కమిషనర్ పావని అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంపై సిబ్బందికి సలహాలు, సూచనలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెల్త్ ఆఫీసర్ డి.పావని, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ శశిభూసన్, అర్బన్ నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి, ఎఎస్ఒ ప్రవీణ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్లు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పివికెకె ఐటి విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న పివికెకె సిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం

పివికెకె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థి దాసరి కార్తీక్ రాష్ట్రస్థాయి ఖో-ఖో ఎంపిలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు తెలిపారు. ఈమేరకు విద్యార్థిని గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పివికెకె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీ.టెక్ మొదటి సంవత్సరం చదువుతున్న దాసరి కార్తీక్ ఇటీవల జరిగిన జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని కళాశాల ఛైర్మన్ కిషోర్ పల్లె, కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, వ్యాయామాధికారి ధనుంజయ అభినందించారు.

వెన్నపూసపల్లిలో నాకాబందీ



ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు

ప్రజాశక్తి-యల్లనూరు

ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామం వెన్నపూసపల్లిలో పోలీసులు గురువారం నాకాబందీ నిర్వహించారు. ఇందులో భాగంగా కార్డెన్‌సెర్చ్, రాత్రి పల్లెనిద్ర చేపట్టారు. ఉదయం అనుమానుతుల ఇళ్లు, పరిసరాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ సత్యబాబు మాట్లాడుతూ గ్రామాల్లో అలజడులు సృష్టించినా, గొడవకు దిగినా, ప్రజా సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు ఆటంకాలు కల్పించినా ఉపేక్షించేది లేదన్నారు. అందరూ ప్రశాంత వాతావరణంలో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామాంజనేయరెడ్డి, పుట్లూరు, యల్లనూరు పోలీసులు పాల్గొన్నారు.